
గరిడేపల్లి మండలం కచవారిగూడెంలో ధ్వంసమైన పాఠశాల ఆవరణ


గరిడేపల్లి మండలం తాళ్లమల్కాపురంలో వరి పొలంలో ఇసుక మేట

# భారీ వర్షంతో తీవ్ర నష్టం

నేరేడుచర్ల(గరిడేపల్లి) సెప్టెంబర్ 2 : రెండ్రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన కురిసిన వర్షానికి తీవ్ర నష్టం వాటిల్లింది. చెరువులు, వాగులు, కత్వాలు అలుగు పోస్తున్నాయి. ఎక్కడ చూసినా దెబ్బతిన్న రోడ్లు, తెగిన చెరువు కట్టలు, నీట మునిగిన పంట పొలాలు, నేల కూలిన విద్యుత్ స్తంభాలు దర్శనమిస్తున్నాయి. అధికారులు నష్టాన్ని అంచనా వేయడానికి పర్యటిస్తున్నారు. గరిడేపల్లి మండలం వెలిదండ చెరువు పొంగడంతో కింద ఉన్న సుమారు 100 ఎకరాల పంట నీటి మునిగింది. కచవారిగూడెం గ్రామంలోని రహదారికి ఆనుకొని ఉన్న చెరువులో వరద ఉధృతికి రోడ్డు వెంట నిర్మించిన సైడ్ వాల్ సుమారు 300 మీటర్ల దూరం కొట్టుకుపోయింది. పాఠశాలలు, ఇండ్లలోకి వరద చేరి బురదమయంగా మారాయి. అప్పన్నపేట, తాళ్లమల్కాపురం గ్రామాల్లో పంటలు నీట మునిగి, ఇసుక మేట చేరింది. పంట నష్టపోయిన వారిని ఆదుకోవాలని రైతులను ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**మేళ్లచెర్వు నుంచి కోదాడకు రాకపోకలు బంద్**

మేళ్లచెర్వు : మండలంలోని కందిబండ శివారులో గల వంతెన సోమవారం ఉదయం కూలిపోయింది. వంతెన మీద బీటలు గుర్తించిన పోలీసులు ఆదివారం సాయంత్రం నుంచే భారీ వాహనాల రాకపోకలను నిషేధించడంతో ప్రమాదం తప్పింది. వంతెన కూలిపోవడంతో మేళ్లచెర్వు నుంచి కోదాడకు రాకపోకలు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కోదాడకు వెళ్లాలంటే హుజూర్‌నగర్ మీదుగా సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా కందిబండ శివారులోని ముత్యాలమ్మ గుడి సమీపంలోని వంతెన కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో వాహనదారులు ఎప్పుడు కూలుతుందోనని భయపడుతున్నారు.

**నృసింహుడి ఆలయంలోకి వరద**

మఠంపలి : కృష్ణా నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పులిచింతల వెనుక జలాలు పెరిగి మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోకి వరద చేరింది. దీంతో ఆలయ సిబ్బంది మోటార్లతో నీటిని తోడేస్తున్నారు.

భారీ వర్షానికి మండలంలోని కిందితండా నుంచి మంచ్యాతండా వరకు గిరిజన సంక్షేమశాఖ నుంచి రూ.1కోటి 20లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది.

**దెబ్బ తిన్న పంటలు పరిశీలన**

పాలకవీడు, సెప్టెంబర్ 2 : వర్షాల కారణంగా మండలంలో దెబ్బతిన్న బ్రిడ్జీలు, రోడ్లు, పంటలను మండల ప్రత్యేకాధికారి శంకర్, ఎంపీడీఓ లక్ష్మి, తాసీల్దార్ కమలాకర్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. వేమూలూరి వాగు వరద ఉధృతికి దెబ్బతిన్న రాఘవపురం లోలెవల్ బ్రిడ్జి, విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లను పరిశీలించారు. రాఘవపురంలో గాయత్రి పవర్ ప్లాంట్ నిర్మాణాలు, కల్మటి తండా లోలేవల్ వంతెన, రావి పహాడ్, మహంకాళీగూడెం గ్రామాల్లో కృష్ణానది ప్రవాహన్ని పరిశీలించారు. మాజీ ఎంపీపీ గోపాల్, రైతులు కూడా ఉన్నారు.


మఠంపల్లి : లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోకి చేరిన పులిచింతల వెనుక జలాలు


హుజూర్‌నగర్ రూరల్ : బూరుగడ్డలో పొలాల్లో నిలిచిన వరద

# కూలిన ఇండ్లు.. కనిపించని దారులు

- నిరాశ్రయులైన పేదలు
- భారీ వర్షానికి వేల ఎకరాల్లో పంట నష్టం
- కోదాడలో పర్యటించిన మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యేలు
- తొగర్రాయి గ్రామాన్ని పట్టించుకోని అధికారులు

కోదాడ, సెప్టెంబర్ 2 : పట్టణంలో వర్ష బీభత్సానికి శిరిడీ సాయినగర్, భవానీ నగర్, మాతా నగర్, హరిజనవాడల్లో ఐదు ఇండ్లు కూలిపోయాయి. మరికొన్ని ఇండ్ల ప్రహరీలు నేలమట్టం అయ్యాయి. సుమారు 150 పైగా ఇండ్లలోకి వరద చేరి విలువైన వస్తువులు తడిచిపోయాయి. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శ్రీరంగాపురం వద్ద తొలగించిన డివైడర్లను పరిశీలించి నష్టాన్ని బాధితులను అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు గాంధీనగర్‌లో ఎమ్మెల్యే పద్మావతి పర్యటించి బాధితులను పరామర్శించారు. లోతట్టు ప్రాంతాలను మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ సందర్శించి బాధితులను ఓదార్చారు.


కోదాడ రూరల్ : కూచిపూడిలో నెలకొరిగిన వరి, కూలిన విద్యుత్ స్తంభం

**తొగర్రాయిలో దయనీయ పరిస్థితి**

- కన్నెత్తి చూడని అధికారులు
- ఎమ్మెల్యే పద్మావతి నామ మాత్రపు పర్యటన

కోదాడ రూరల్ : వర్ష బీభత్సానికి మండల పరిధిలోని తొగర్రాయి, కూచిపూడి, మంగలి తండా, చిమిర్యాల, రెడ్లకుంట గ్రామాల్లో వరి పంటపొలాల్లో ఇసుక మేట చేరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. చిలుకూరు మండల పరిధి నారాయణపురం చెరువు తెగి తొగర్రాయి గ్రామం మునిగిపోయింది. మూడువైపులా రోడ్లు తెగిపోయి గ్రామం నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొన్నది. ఇప్పటి వరకు ఒక్క అధికారి కూడా గ్రామం వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరా, తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విలపిస్తున్నారు. చాలా ఇండ్లు నేటమట్టమై, పలు గృహాల్లోకి నీరు చేరి నిత్యావసరాలు తడిచి పోయాయని మహిళలు చెప్పున్నారు. కాల్వ ఒడ్డున మోటార్లన్నీ కొట్టుకొని పోయాయని రైతులు వాపోయారు. రెడ్లకుంట, చిమిర్యాల, మంగలి తండా గ్రామాల్లో రైతులు వందల ఎకరాల్లో పంట నష్టపోయారు. వీటితో పాటు గేదెలు, మేకలు, కోళ్లు అధిక సంఖ్యలో మృత్యువాత పడ్డాయి. ఇదిలా ఉండగా తొగర్రాయి గ్రామాన్ని ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి సోమవారం ఉదయం అధికారులతో కలిసి నామ మాత్రంగా సందర్శించారు.


కోదాడ రూరల్ : దుర్గాపురం స్టేజీ వద్ద ఎన్‌హెచ్ 65పై రాకపోకలు బంద్ కావడంతో సోమవారం మధ్యాహ్నం నిలిచిపోయిన వాహనాలు


మోతె : మామిళ్లగూడెంలో కూలీల పెంకుటిల్లు


మోతె : బీక్యాతండాలో కూలిపోయిన పూరిగుడిసె

**విజయవాడ-హైదరాబాద్‌కు రాకపోకలు పునః ప్రారంభం**

కోదాడ రూరల్ : ఆంధ్రా – తెలంగాణ సరిహద్దులో రామాపురం క్రాస్‌రోడ్డు సమీపంలోని పాలేరు వాగుపై పాత బ్రిడ్జి డ్యామేజ్ కావడం, ఆంధ్రా రాష్ట్రం నందిగామ వద్ద వరద ఉధృతి తగ్గడంతో విజయవాడ – హైదరాబాద్‌కు భారీ వాహనాల రాకపోకలకు అనుమతులిచ్చారు. అయితే నందిగామ వరకు మాత్రమే అనుమతులు ఉన్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. విజయవాడ వరకు ప్రస్తుతం వాహనాల రాకపోకలను నిలిపివేసినట్లు పేర్కొన్నారు.


కోదాడ మండల పరిధిలోని నల్లబండగూడెం శివారులో తెగిన పాలేరు వాగును పై తెగిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి

# రైతులను ఆదుకుంటాం : మంత్రి ఉత్తమ్

నడిగూడెం/కోదాడ రూరల్, సెప్టెంబర్ 2 : పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాగితరామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమ కాల్వపై పడిన గండిని ఆయన పరిశీలించి మాట్లాడారు. వరద తగ్గిన వెంటనే గండిని యుద్ధ ప్రాతిపదికన పూడ్చివేస్తామన్నారు. గండి పడటం వల్ల సుమారు 300 ఎకరాలకు పైగా నష్టం సంభవించిందని తెలిపారు.

కోదాడ మండల పరిధిలోని నల్లబండగూడెం శివారు పాలేరు వాగుపై హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు బ్రిడ్జి ఆంధ్రా సరిహద్దు వద్ద చివర తెగిపోయింది. దీంతో ఆంధ్ర –తెలంగాణకు రాకపోకలు నిలిచిపోయాయి.పాలేరు వాగుకు ఇరువైపులా ఎన్‌హెచ్–65పై వాహనాలు భారీగా నిలిచిపోయాయి. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి సోమవారం బ్రిడ్జిని పరిశీలించారు. మంత్రి ఉత్తమ్ స్థానిక అధికారులతో మాట్లాడి, పలు సూచనలు చేశారు. కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, స్థానిక అధికారులు, మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, ఎడమ కాల్వ మాజీ చైర్మన్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, లంకెల నిరంజన్‌రెడ్డి, బెంజిమెన్, శరభయ్య, మాజీ ఎంపీపీ యాతాకుల జ్యోతి ఉన్నారు.

**వాహనదారులకు అన్నదానం**

కోదాడ మండల పరిధిలోని నల్లబండగూడెం శివారు, చిమిర్యాల క్రాస్‌రోడ్డు, దుర్గాపురం, శ్రీరంగాపురం శివారులోని ఎన్‌హెచ్–65 రహదారిపై నిలిచిన వాహనదారులు, ప్రయాణికులకు పోలీస్, పట్టణ స్వర్ణ భారత్‌ట్రస్ట్ సహకారంతో అన్నదానం చేశారు.


అర్వపల్లి : కోడూరు వద్ద రోడ్డుపై నుచి ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

# జాతీయ రహదారిని ఎమ్మెల్యే పరిశీలన

మద్దిరాల/తిరుమలగిరి : మండలంలోని పోలుమల్ల సమీపంలో వరద ఉధృతికి ఎన్‌హెచ్ 365 కోతకు గురైంది. సోమవారం ఎమ్మెల్యే మందుల సామేల్ రహదారిని పరిశీలించి అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా వర్షాలకు మండల వ్యాప్తంగా సుమారు 1200 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. అదే విధంగా తిరుమలగిరిలో మొత్తం 270 ఎకరాల్లో పంట నష్టం అయ్యిందని తెలిపారు.


పోలుమల్ల శివారులో కోతకు గురైన ఎన్‌హెచ్ 365ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

**కేజీబీవీ పరిశీలన**

అర్వపల్లి : మండల కేంద్రంలో నీట మునిగిన కేజీబీవీని ఐబీ డీఈ పిచ్చయ్య, పీఆర్ డీఈ బాబురావు, ఎంఈఓ బాలూనాయక్ సోమవారం సందర్శించారు. కేజీబీవీ నుంచి మెయిన్ రోడ్డు వరకు కాల్వ నిర్మించి నీళ్లు పోయేటా చూడడానికి సర్వే నిర్వహించారు. ప్రతిపాదనలు తయారు చేసి ఎమ్మెల్యే సామేల్‌కు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

**సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : తాసీల్దార్**

అర్వపల్లి : వర్షాకాలంలో రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తాసీల్దార్ జె శ్రీనివాస్ అన్నారు. కార్యాలయ సిబ్బందితో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు.

# వరద నష్టం అంచనాలు ఇవ్వాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, సెప్టెంబర్ 2 : జిల్లాలో వరదల వల్ల కలిగిన నష్టం అంచాన వివరాలు ఇవ్వాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో వర్షం, వరదల వల్ల జరిగిన నష్టంపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాసీల్దార్లు, ఎంపీడీఓలు తక్షణ సహాయ చర్యలు చేపట్టాలన్నారు. డ్రైనేజీల పూడిక తీత, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ఆస్తి, ప్రాణ నష్టం, పశు మరణాల వివరాలు మంగళవారం సాయంత్రం వరకు అందించాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, విద్యుత్ అంతరాయాలను వెంటనే గుర్తించాలని, చెరువు కట్టల నాణ్యతను పరిశీలించి తెగకుండా జాగ్రత్తలు, మరమ్మతులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీఆర్‌డీఓ అప్పారావు, ఆర్డీఓ వేణుమాధవ్, అధికారులు శ్రీనివాస్‌రావు, సురేశ్ కుమార్, అశోక్ పాల్గొన్నారు.


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

## తడిసిన కేసు ఫైళ్లను పరిశీలించిన జిల్లా జడ్జి

కోదాడటౌన్, సెప్టెంబర్ 2 : కోర్టు లోపలికి వరద నీరు చేరడంతో కేసులకు సంబంధించిన ఫైల్స్ తడిసిపోయాయి. దీంతో జిల్లా జడ్జి గోవర్ధన్‌రెడ్డి, సబ్ జడ్జి శ్యామ్ కుమార్‌తో కలిసి కోర్టును సందర్శించి తడిసిన ఫైల్స్‌ను పరిశీలించారు. భవనంలోకి వరద చేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరిస్థితులను హైకోర్టు దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి శ్యామ్‌సుందర్, అడిషినల్ జూనియర్ జడ్జి భవ్య, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గట్ల నరసింహారావు, శరత్‌బాబు, ఉయ్యాల నర్సయ్య, మంద వెంకటేశ్వర్లు, నవీన్‌కుమార్, కోడూరు వెంకటేశ్వర్లు, అబ్దుల్, రహీం, పాషా, కరీముల్లా, సిబ్బంది పాల్గొన్నారు.


కోర్టులో తడిసిన ఫైళ్లను పరిశీలిస్తున్న జిల్లా జడ్జి గోవర్ధన్‌రెడ్డి, సిబ్బంది



చిలుకూరు : కోతకు గురైన ఆర్లెగూడెం-రామచంద్రానగర్ రోడ్డు


మద్దిరాల : మండల కేంద్రంలో ఉధృతంగా ప్రవహిస్తున్న బంధం వాగు


అనంతగిరి : కృష్ణాపురంలో కూలిన ఇంటి గోడ

## మూసీకి భారీగా ఇన్‌ఫ్లో.. 7గేట్లు ఎత్తివేత

సూర్యాపేట రూరల్, సెప్టెంబర్ 2 : మూసీ ప్రాజెక్టుకు భారీగా వరద వస్తున్నది. దీంతో అధికారులు సోమవారం ప్రాజెక్టు 7 గేట్లను ఒక ఫీట్ ఎత్తి 17,052వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులకు గాను ప్రస్తుతం 641.53 అడుగుల వద్ద నీరు నిల్వ ఉంది. మొత్తం 4.46 టీఎంసీలకు గాను ప్రస్తుతం 3.58టీఎంసీల మేర నీరు ఉంది. ఎగువ నుంచి ప్రాజెక్టుకు సుమారు 7,549 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుందని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.



## రైతులను ఆదుకోవాలి : సీపీఐ

నేరేడుచర్ల(గరిడేపల్లి), సెప్టెంబర్ 2 : భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గరిడేపల్లి మండలంలోని సుభాష్‌నగర్, లక్ష్మీపురం గ్రామాల్లో దెబ్బ తిన్న పంట పొలాలను సీపీఐ బృందంతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. వ్యవసాయ అధికారులతో సర్వే చేయించి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నంద్యాల పిచ్చిరెడ్డి, ఇజ్రాయిల్, గూడెపు యాదగిరి, విజయ్, బన్నీ, రాంరెడ్డి ఉన్నారు.

**రైతులకు పరిహారం అందించాలి**

మఠంపల్లి : పంట నష్టపోయిన రైతులకు రూ.20వేలు పరిహారం అందించాలని తెలంగాణ రైతుసంఘం, సీపీఎం నాయకులు అన్నారు. మండలంలోని చౌటపల్లి, మఠంపల్లి, బక్కమంతులగూడెం గ్రామాల్లో సోమవారం నీట మునిగిన పంటలను వారు పరిశీలించారు.

కోదాడ/కోదాడ రూరల్ : పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20వేలు అందించి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యాక్షుడు బొల్లు ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. తమ్మరలో పొలాలను స్థానిక రైతులతో కలిసి సోమవారం పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో కేవీఎల్‌ఎన్ ప్రసాద్, మాతంగి ప్రసాద్, రాధాకృష్ణ, బత్తినేని రమేశ్, బొల్లు నరేశ్, సామినేని నరసింహారావు, నాగేశ్వరావు పాల్గొన్నారు.


గరిడేపల్లి మండలం లక్ష్మీపురంలో పంట నష్టపోయిన పొలాలను పరిశీలిస్తున్న సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు

## మిర్యాలగూడలో దొంగలించి నేరేడుచర్లలో వదిలి..

- లారీ చోరీ ఘటనలో దొంగల చేతివాటం
- రూ.4లక్షల విలువైన టైర్లు, రిమ్ములు ఎత్తుకెళ్లిన వైనం

నేరేడుచర్ల, సెప్టెంబర్ 2 : నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని తడకమళ్ల రోడ్డులో ఆగి ఉన్న లారీని ఈనెల 1న దొంగలు ఎత్తుకెళ్లారు. కట్ చేస్తే ఆ లారీ సోమవారం ఉదయం నేరేడుచర్ల పట్టణ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీ సమీపంలో మిర్యాలగూడ –కోదాడ జాతీయ రహదారి పక్కన ప్రత్యక్షమైంది. అయితే అక్కడ లారీ ఉంది కానీ దానికి టైర్లు, రిమ్ములు లేవు. స్థానికులు గుర్తించి యజమానికి సమాచారం అందించగా.. అతను పోలీసులతో కలిసి వచ్చి లారీకి వేరే టైర్లు అమర్చి తీసుకెళ్లాడు. రాత్రి సమయంలో పెద్ద జాకీలతో టైర్లు, రిమ్ములు విడదీసి మరో వాహనంలో ఎత్తుకెళ్లినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వీటి విలువ సుమారు రూ.4లక్షలు ఉంటుందని లారీ యజమాని తెలిపాడు.


టైర్లు, రిమ్ములు ఎత్తుకెళ్లి లారీ వదిలేసిన దుండగులు

## నల్లబెల్లం పట్టివేత

మద్దిరాల, సెప్టెంబర్ 2 : అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల నల్లబెల్లాన్ని సోమవారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ వీరన్న తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మామిండ్లమడవ గ్రామానికి చెందిన షేక్ సైదులు ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు నుంచి నాటు సారా తయారీ కోసం ఉపయోగించే 30 క్వింటాళ్ల నల్లబెల్లం కొనుగోలు చేశాడు. దాన్ని టాటా ఏస్ వాహనంలో మామిండ్లమడవకు తరలిస్తుండగా మండలంలోని గోరెంట్ల శివారులోకి రాగానే కచ్చితమైన సమాచారంతో దాడులు జరిపి బెల్లాన్ని సీజ్ చేసి కొనుగోలు చేసిన వ్యక్తి, టాటా ఏస్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## రుణమాఫీ కోసం రైతుల పడిగాపులు

నేరేడుచర్ల, సెప్టెంబర్ 2 : రైతు రుణమాఫీ కాని వారు మరలా దరఖాస్తు చేసుకోవాలనే ప్రభుత్వం సూచించింది. దీంతో పట్టణ వ్యవసాయ కార్యాలయం ఎదుట దరఖాస్తులను ఇవ్వడం కోసం సోమవారం రైతులు బారులు దీరారు. మండలంలోని పెంచికల్‌దిన్న, నేరేడుచర్ల, చిల్లేపల్లి పీఏసీఎస్ పరిధిలో రుణమాఫీ కాని రైతుల్లో రేషన్ కార్డులు లేని వారు 1,560 మంది ఉన్నట్లు ఏఓ కార్యాలయానికి లిస్టు వచ్చింది. వీరు దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, పట్టాదార్ పాస్‌పుస్తకం జీరాక్స్‌తో వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. రైతులు వ్యవసాయ కార్యాలయాల వద్దకు రాగా వివరాలు నమోదు చేసే యాప్ సర్వర్ పని చేయక పోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. సర్వర్ పనిచేస్తున్నప్పుడు వివరాలు నమోదు చేస్తున్నప్పటికీ ఇప్పటి వరకు కేవలం సుమారు 500 మంది పేర్లను మాత్రమే అప్‌లోడ్ చేశారు. ఈనెల 5తో గడవు ముగుస్తుందని తెలియడంతో మిగిలిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ యాప్‌లో అప్‌లోడ్ చేయడం వల్ల సమయం వృధా అవుతుందని, ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని రైతులు కోరుతున్నారు.


నేరేడుచర్ల వ్యవసాయ కార్యాలయం ఎదుట రుణమాఫీ దరఖాస్తులు ఇవ్వడానికి రైతుల పడిగాపులు

## వృద్ధులకు ఆర్థికసాయం

బొడ్రాయిబజార్, సెప్టెంబర్ 2 : జిల్లా కేంద్రంలోని కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం వృద్ధులకు ఆర్థికసాయం అందించారు. సీడబ్ల్యూసీ ఆవిర్భవించి ఏడేండ్లు పూర్తయిన సందర్భంగా ఆర్థికసాయం అందించినట్లు సీడబ్ల్యూసీ అధ్యక్షుడు రత్న ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో చింతకింది అనిల్‌కుమార్, రాఘవేందర్, సూర్యాపేట డివిజన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## చెక్ బౌన్స్ కేసులో వ్యక్తికి జైలు, రూ.10లక్షలు జరిమాన

సూర్యాపేట లీగల్, సెప్టెంబర్ 2 : జిల్లా కేంద్రానికి చెందిన ఓ మహిళపై చెక్‌బౌన్స్ కేసు నిరూపణ కావడంతో ప్రథమ శ్రేణి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.సురేశ్ నిందితురాలిని దోషిగా నిర్ధారిస్తూ ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ.10లక్షల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించారు. కేసు వివరాల ప్రకారం.. సూర్యాపేటకు చెందిన తాళ్లం చంద్రగుప్తా, కోమటిరెడ్డి బోజిరెడ్డి స్నేహితులు. ఇదిలా ఉండగా బోజిరెడ్డి.. చంద్రగుప్తా వద్ద 2017 ఫిబ్రవరి 1న రూ.5లక్షలు అప్పు తీసుకున్నాడు. ఆ మొత్తానికి ప్రామిసరి నోటు రాసి ఇవ్వగా, బోజిరెడ్డి భార్య రమణ దానికి జమానత్‌గా సంతకం చేసింది. 2019లో చంద్రగుప్తా అప్పు తీర్చాలని బోజిరెడ్డిని అడగ్గా జమానత్‌గా ఉన్న భార్య రమణ.. రూ.5 లక్షల చెక్కు ఇచ్చింది. వసూలు నిమిత్తం చెక్కును బ్యాంకులో వేయగా ఖాతాలో డబ్బు లేని కారణంగా చెక్ బౌన్స్ అయ్యిందని గ్రహించిన చంద్రగుప్తా కోమటిరెడ్డి రమణకు లీగల్ నోటీసులు పంపాడు. అయినా డబ్బు చెల్లించకపోవడంతో బాధితుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. కేసు విచారణ అనంతరం దోసిగా నిర్ధారణ కావడంతో రమణకు శిక్ష పడింది.

## ముత్యాలమ్మకు బోనాలు

నేరడుచర్ల(గరిడేపల్లి), సెప్టెంబర్ 2 : గరిడేపల్లి మండల కేంద్రంలో బోనాల పండుగను సోమవారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా మహిళలు ముత్యాలమ్మకు నైవేద్యం వండి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

## నేడు ఆయ్యప్ప ఆలయంలో 16 రోజుల పండుగ

నేరేడుచర్ల, సెప్టెంబర్ 2 : పట్టణంలో నూతనంగా నిర్మించిన స్వామి అయ్యప్ప ఆలయంలో నేడు 16 రోజుల పండుగను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 8 :30 గంటలకు ప్రత్యేక అభిషేకాలు, మధ్యాహ్నం 12 గంటలకు ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కమిటీ కోరింది.

## అర్వపల్లి లైన్‌మెన్‌గా వెంకట్‌రెడ్డి

అర్వపల్లి, సెప్టెంబర్ 2 : జాజిరెడ్డిగూడెం విద్యుత్ లైన్‌మెన్‌గా వెంకట్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన తుంగతుర్తి మండలం వెలుగుపల్లి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.